**కథ**

**అత్తగారింటి నుండి ఒంటరిగా వచ్చిన కూతురు కవిత చెబుతున్న మాటలు విని, విని సహనం నశించి...**

**"అసలు మీ ఆయన మనసులో ఏమనుకుంటున్నాడో అర్థం కావడం లేదు. ప్రతి చిన్నవిషయానికీ భార్యని పుట్టింటికి తరమడం అతని దృష్టిలో మగతనం కాబోలు" అన్నాడు ఆవేశంగా ఆఫీసుకెళ్లబోతున్న నారాయణమూర్తి.**

# నాణ్ణానికి మరోవైపు...

''కొంచెం ఆవేశం తగ్గించండి. రోలుకి ఒక పక్కనే దరువు, మద్దెలకి ఇరుప్రక్కలా దరువు అన్నట్టుంది మన అమ్మాయి పరిస్థితి'' అంది నారాయణమూర్తి భార్య గాయత్రి.

''మద్దెల కాదమ్మా! ఫుట్‌బాల్ అంటే బావుంటుంది. ఇక్కడ తంతే అక్కడ, అక్కడ తంతే ఇక్కడ. ఆడపిల్లకి పెళ్లయిన తర్వాత భర్త ఇంట్లో ఉన్నంతవరకే గౌరవం అని మీరెవరూ కలగజేసుకోకుండా వచ్చిన దారినే నన్ను పంపిస్తుండబట్టే ఈసారి నాపై చెయ్యి చేసుకుని మరీ పంపాడు మీ అల్లుడు''అంది కవిత తండ్రి ఆవేశానికి రెట్టింపుగా.

''సరే! సరే! రేపు నేనే వెళ్ళి ఆ అబ్బాయితో రెంటిలో ఏదో ఒకటి తేల్చుకువస్తాను. నువ్వు లోపలికి వెళ్ళు'' అని ఆఫీసుకి బయల్దేరాడు నారాయణమూర్తి.

★ ★ ★

మర్నాడుదయం ఇంటర్‌సిటీ రైల్లో గుంటూరు చేరేసరికి మధ్యాహ్నమైంది.

కాలింగ్ బెల్ శబ్దానికి తలుపుతీసింది శారద. ఎదురుగా కన్పించిన వియ్యంకుడితో...

''రండి! అన్నయ్యగారూ! ఇదేనా రావడం'' అని లోపలికి నడిచింది.

సోఫాలో కూర్చున్న భావన, నారాయణమూర్తిని చూసి నుంచుని ''రండి మావయ్యా'' అంది.

''నువ్వు కూర్చోమ్మా లేవడమెందుకు'' అని తనతో తెచ్చిన మామిడిపళ్ళ సంచీ శారదకిస్తుంటే..

''ఎందుకన్నయ్య గారూ ఇవన్నీ''

''ఏమున్నాయిలేవమ్మా పళ్ళేగా'' తీసుకుని లోపల పెట్టిన శారద,

''వదినగారూ, కవిత బాగున్నారా?''

''ఆఁ నిక్షేపంలా ఉన్నారు''

''కాళ్ళు కడుక్కురండన్నయ్యా. భోంచేద్దురు''

''అబ్బాయిని రానివ్వమ్మా''

''వాడొచ్చేసరికి ఒకటిన్నర దాటుతుంది''

''తొందరేముందిలే. అల్లుడు వచ్చాక కలిసి తింటాం'' అని పేపర్ చూస్తూ కూర్చున్నాడు.

భావన లేచి లోపలికెళ్ళింది.

కవిత గురించి శారదేమైనా అడుగుతుందేమో అనుకున్నాడు కానీ ఆమె ఆ ఊసే ఎత్తలేదు.

మరో గంట తర్వాత ఇంటికి వచ్చిన మురళి మామగారిని చూసి పలకరించాడు.

కొడుకును చూసి శారద భోజనం వడ్డించడంతో మామా అల్లుళ్ళు కలిసి భోజనం చేశారు. మురళి ఆఫీసుకి వెంటనే వెళ్లాడు.

''అన్నయ్య గారూ! ఆ గదిలో పడుకోండి'' అంది శారద.

ఆమెతో మాట్లాడదామనుకున్న నారాయణమూర్తికి, ఆమె వెంటనే లోపలికి వెళ్ళిపోవడంతో లేచి వెళ్ళి మంచం మీద నడుంవాల్చక తప్పలేదు. ఆలోచిస్తున్న నారాయణమూర్తికి శారద తామరాకు మీది నీటిబొట్టులా కవిత గురించి అడగకపోవడం వింతగా అన్పించింది.

★ ★ ★

సాయంత్రం ఆరింటికి ఇంటికొచ్చాడు మురళి. టీ త్రాగి

''బయటికెళ్దాం రండి'' అన్నాడు మామగారితో.

అల్లుడి ఆంతర్యం అర్థం చేసుకున్న నారాయణమూర్తి అతన్ని అనుసరించాడు. జిన్నాటవర్ సెంటర్ దగ్గరున్న గాంధీపార్కు ముందు బైక్ పార్క్ చేశాడు మురళి. ఇద్దరూ పార్కులో బెంచీ మీద కూర్చున్నారు.

ఎలా ప్రారంభించాలా?! అని సంశయిస్తున్న మామగారి మౌనాన్ని మాటల్లో పెడుతూ..

''కవిత ఎలా ఉందండీ?'' అని మురళి అడిగేసరికి

''కవిత గురించే మాట్లాడదామని వచ్చాను బాబూ! మీ ఇద్దరిమధ్యా ఏ అభిప్రాయబేధాలున్నాయో నాకు తెలియదు గానీ ఇలా అమ్మాయిని మూడు మూణ్ణాళ్లకే పుట్టింటికి పంపడం వలన సమస్యలు పరిష్కారం కావు. కవితకి తొందరపాటు, పిడివాదమూ ఎక్కువే. కాదనను. వచ్చిన ప్రతిసారీ మేమూ ఎన్నో విధాల నచ్చజెప్పి పంపిస్తున్నాం. పెళ్ళయిన సంవత్సరంలోపే ఇలా స్పర్థలు పుట్టుకొస్తే ఇంకా ఎంతోకాలం కల్సి జీవించాల్సిన మీలో అవి అడ్డుగోడలుగా నిలబడతాయి. సమస్య ఏమిటో చెబితే దానిని ఎదగనివ్వకుండా చూద్దామన్న ఉద్దేశంతోనే వచ్చాను'' అన్నాడు నారాయణమూర్తి.

''ప్రతిసారీ నేను మీ అమ్మాయిని పుట్టింటికి పంపుతున్నాననడంలో వాస్తవం లేదు. కానీ ఈసారి నేనే పంపాను. అమెనలా పంపడం నాకూ ఇష్టం లేదు. అయినా తప్పలేదు''

మా పెళ్ళయిన రెండు నెలలకే రోడ్ యాక్సిడెంట్‌లో భర్తని కోల్పోయిన మా అక్క భావన ఇంటికి రావడం మీకూ తెల్సిందే. భర్తను పోగొట్టుకుని దుఃఖంలో ఉన్న ఆమెని తిరిగి మామూలు మనిషిని చెయ్యాల్సిన బాధ్యతలో కనీసం పాలుపంచుకోకపోగా ఆమె ముందే కొత్తచీరలు కట్టుకుని, తలనిండా పూలు పెట్టుకుని తిరగడం, ఇంట్లో ఉన్న అమ్మకి సహాయం చెయ్యకపోగా, పక్కఇంట్లోకూర్చుని గంటలకొద్దీ కాలక్షేపం చెయ్యడం, బయటికి తీసుకెళ్లమని నన్ను వేధించడం. మొదట్లో ఆమెకి తెలియదేమోననుకుని అనునయంగా చెప్పాను. కానీ కవిత కావాలనే అలా ప్రవర్తిస్తోందని గ్రహించి కాస్త గట్టిగా చెప్పేసరికి మీ కూతురేమందో తెలుసా?''

''ఈ ఇంట్లో చీర కట్టుకుంటే తప్పు, పూలు పెట్టుకోవడం తప్పు. పక్కవాళ్లతో మాట్లాడడం తప్పు. భర్తతో బయటికి వెళ్ళాలనుకోవడం తప్పు'' అని నాతో వాదిస్తుంటే అక్కయ్య ఎక్కడ వింటుందోనని నేనే తగ్గి బయటికి వెళ్ళబోతుంటే-

''భర్త పోయిన మీ అక్కయ్యతో బాటూ నేనూ ఎన్నాళ్ళిలా పడుండాలో చెప్పి వెళ్లండి. అప్పటివరకూ నేను మా పుట్టింట్లో ఉంటాను'' అంది.

ఎవరి చెవిన ఆ మాటలు పడరాదని భయపడ్డానో అనుకున్నట్టుగానే అమ్మ ఆ మాటల్ని విన్నది.



ఆరోజు రాత్రి అమ్మ నన్ను పిలిచి...

''చూడు మురళీ! ఎదుటిమనిషి సంతోషాన్ని పంచుకున్నంత తేలిగ్గా దుఃఖాన్ని పంచుకోవడం అందరివల్లా కాదు. ఒకళ్ల దుఃఖం మరొకరి సంతోషానికి అడ్డురానంత వరకే ఆప్యాయతలు నిలుస్తాయి. అడ్డొస్తే అడ్డుగోడలు నిలబడతాయి. మీ ఇద్దరిమధ్యా నేనూ, భావన అడ్డుగోడలవడం నాకిష్టం లేదు. ఇలాంటి సున్నిత విషయాలు శృతిమించకుండా ఆదిలోనే జాగ్రత్తపడాలి. మింగలేక, కక్కలేక నువ్వు పడే అవస్థ చూస్తూనే ఉన్నాను. అరండల్‌పేటలో జానకి అత్తయ్య వాళ్ళ ఇల్లు ఖాళీగా ఉందట. నేనూ, భావన కొన్నాళ్ళపాటు అక్కడ ఉంటాం. ఆర్థికంగా ఏ ఇబ్బందులూ లేవు కాబట్టి మా గురించి ఎక్కువగా ఆలోచించకు. మీ ఇద్దరూ ఆనందంగా ఉండడమే నాకు కావల్సింది. కవితని బాగా చూసుకో. వచ్చేవారం నేనూ, భావన వెళ్తున్నాం'' అనేసరికి అమ్మకి ఏం బదులు చెప్పాలో తెలీక లేచొచ్చాను.

ఆరోజు రాత్రి కవితతో అమ్మ చెప్పిందంతా చెప్పాను. విని మౌనంగా కూర్చుంటే...

''చూడు కవితా! బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన మా ఇద్దరి కోసం అమ్మ అహర్నిశలూ శ్రమించి, ఇంతవాళ్లని చేసింది. చిన్నవయసులోనే భర్తని కోల్పోవడం అక్క పాలిట శాపంలా మారి ఇంటికొచ్చింది. దుఃఖంలో ఉన్న ఆమెకి అండగా ఉండి, మళ్లీ ఆమెకో జీవితాన్ని ఏర్పర్చాల్సిన మనం కారణంగా మారి వాళ్ళు వెళ్లిపోతామంటే చూస్తూ ఊర్కోవడం సమంజసమా? మన ఇద్దరి సంతోషాన్ని కొన్నాళ్లపాటు నాలుగ్గోడల మధ్య పంచుకుందాం. నిన్ను నేను అర్థం చేసుకోగలను. పగలంతా ఇంట్లో ఉండడం కష్టమనిపిస్తే జాబ్ చెయ్యి. నా ఫ్రెండ్స్ ట్యూటోరియల్ కాలేజీ నడుపుతున్నారు. అందులో జాబ్ చెయ్యి'' అని అనునయంగా చెబితే మీ కూతురిచ్చిన బదులు ఇదీ.

''మా నాన్న మీరు అడగకపోయినా లక్షరూపాయలు కట్నం ఇచ్చి, ఘనంగా పెళ్ళి చేసింది మీతో సుఖపడతానని గానీ పగలంతా ఉద్యోగం చేసి రాత్రిళ్ళు మరబొమ్మలా యాంత్రిక జీవనం గడపడానిక్కాదు. సుఖం, సంతోషం లేకుండా కూపస్థమండూకంలా పడుండడం నావల్లకాదు. నేను రేపే మా ఇంటికి వెళ్తున్నాను'' అంది మొండిగా. ఆ పై ఇద్దరి మధ్యా వాగ్యుద్ధం పెరిగి పెద్దదై, నా సహనానికి పరాకాష్టగా ఆమెపై చెయ్యి చేసుకునే వరకూ తీసుకెళ్లింది. ఆ మర్నాడే కవిత మీ ఇంటికి వచ్చింది.

ఎం.వెంకటేశ్వరరావు

ఇప్పుడు చెప్పండి, నా తప్పేమిటో. సంవత్సరం క్రితం నా జీవితంలోకి వచ్చిన మీ కూతురి కోసం నావాళ్లని వదులుకొమ్మంటారా? నన్ను కన్నతల్లిని, చిన్నతనం నుండి కలిసి పెరిగిన అక్కయ్యని ఇవ్వాళ కష్టంలో ఉంటే ఆదుకోకుండా నా సంతోషం కోసం స్వార్థపరుడిగా మారలేను. ఒకవేళ నన్ను లక్షరూపాయలకి కొనుక్కున్నట్టుగా మీ అమ్మాయి భావిస్తే ఆ డబ్బు మీ కూతురి పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశాను. మీరు నిరభ్యంతరంగా తీసుకెళ్ళొచ్చు. నాతోపాటు నా వాళ్లని ఆదరించగల పరిపక్వత వచ్చినప్పుడే కవిత నాతో సుఖజీవనం సాగించగలదు. ఆమె మీద నాకెటువంటి కోపమూ లేదు. ఆమె కోరుకునే సంతోషం మీ

ఇంటిదగ్గర దొరుకుతుంటే అక్కడే ఉండని వ్వండి'' కామాలు, ఫుల్‌స్టాప్‌లూ లేకుండా మాట్లాడిన మురళి వైపు అచేతనంగా చూస్తున్న నారాయణమూర్తికి మాటలు పెగల్లేదు.

''ఏవేవో ఊహించుకుని నిన్ను అపార్థం చేసుకున్నందుకు ఏమీ అనుకోకు బాబూ!'' అని అల్లుడి చేతులు పట్టుకున్నాడు.

మర్నాడు మధ్యాహ్నానికి ఇల్లు చేరిన నారాయణమూర్తి భోంచేసి పడుకున్నాడు. సాయంత్రమైనా అత్తగారింటి విషయాలేవీ తండ్రి చెప్పకపోయేసరికి కవితలో కంగారు అధికమై, తల్లితో అడిగించింది. నారాయణమూర్తి భార్యని విసుక్కోవడంతో మౌనంగా కూర్చుంది.

టైం ఆరు దాటుతుండగా లోపల ఉన్న భార్యతో ''గాయత్రీ! త్వరగా తయారవ్వు. జింఖానా గ్రౌండ్సులో చినజీయర్ స్వామి తిరుప్పావై చెబుతున్నారు. వెళ్ళొద్దాం'' అన్నాడు.

కవిత కూడా తల్లితో బాటు తయారైంది.

కూతుర్ని చూసిన నారాయణమూర్తి ''స్కూటర్ మీద ముగ్గురం ఎలా వెళ్తాం. కవితా! ఇంట్లో ఉండు. మేం వెళ్ళొస్తాం'' అన్నాడు.

బ్రాన్పడిన కవిత మనసు ఆలోచనలు పరిభ్రమిస్తుంటే తలుపులు మూసి యాంత్రికంగా టీవీ ముందు కూర్చుంది.

★ ★ ★

మర్నాడు ఆఫీసుకెళ్లిన నారాయణమూర్తి గంటలో తిరిగిరావడంతో తల్లీకూతుళ్ళు ఆశ్చర్యపోయారు.

ఇంట్లోకి అడుగుపెడుతూనే ''గాయత్రీ! త్వరగా తెములు సంగీత్‌లో 'సఖి' సినిమాకి టిక్కెట్లు తెచ్చాను'' అన్నాడు.

''కవితా! నువ్వూ చీర మార్చుకుని రెడీ అవ్వు'' అంది గాయత్రి.

''రెండు టిక్కెట్లే దొరికాయి. ముగ్గురమెలా వెళ్తాం'' అని నారాయణమూర్తి అనేసరికి-

''అయితే మీ తండ్రీకూతుళ్ళు వెళ్లి రండి'' అంది గాయత్రి.

''అది భార్యభర్తలు కల్సి చూడాల్సిన సినిమా! త్వరగా నువ్వు తెములు'' నారాయణమూర్తి విసుగ్గా అనేసరికి

తండ్రి ఆంతర్యం అర్థం చేసుకున్న కవిత

''అమ్మా!నాకు తలనొప్పిగా ఉంది. మీరిద్దరూ వెళ్లిరండి'' అనడంతో ఆపై భార్యని మాట్లాడనివ్వకుండా బయల్దేరదీశాడు నారాయణమూర్తి.

ఇంట్లో కూర్చున్న కవితకి ఒంటరితనం వెంటాడుతున్నట్టు అన్పించింది. అత్తగారు, భర్త తనమీద తండ్రికి ఏదో చెప్పి ఉంటారన్నదే ఆమె ఆలోచన. ఏం చెయ్యాలన్నా మనసు నిలకడ కుదరడం లేదు. చదువుతున్న పుస్తకంలో అక్షరాలన్నీ అలికినట్టు కన్పిస్తున్నాయి. టీవీ చూడాలన్పించడం లేదు. సాయంత్రం వరకూ పళ్ళబిగువున ఒంటరితనాన్ని భరించింది. సినిమా నుండి ఆరింటికి వస్తారనుకున్న తల్లీ తండ్రీ ఎనిమిది అవుతున్నా రాలేదు. ఏం చేయాలో తోచక పక్కింటికెళ్లింది. పక్కింటావిడ కవితని భర్త గురించి, అత్తగారు గురించి గుచ్చిగుచ్చి ఆరాలు తీయడం మొదలుపెట్టేసరికి కూర్చోలేక ఇంటికొచ్చేసింది. ఏ పనిమీదా ఏకాగ్రత కుదరడం లేదు.

ఎప్పుడు ''కవితా! కవితా!'' అని వెంటపడి పలకరించే తండ్రి రెండ్రోజులుగా మౌనంగా ఉండడం దుర్భరంగా ఉంది. రాత్రి పదిన్నరకి ఇంటికొచ్చిన తల్లీదండ్రిని చూసేసరికి క్షణంలో పెరిగిన కోపపు డిగ్రీ, తండ్రి మొహంలోని సీరియస్‌నెస్ చూసి మౌనంగా దిగిపోయింది. తన కోపాన్ని ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండా స్నానం చేసొచ్చిన తండ్రి ''కవితా! త్వరగా భోజనం వడ్డించమ్మా! ఆకలి దంచేస్తోంది'' అన్నాడు.

అప్పుడుగానీ కవితకి జ్ఞప్తికి రాలేదు. ఇంట్లోనే ఉన్నా కనీసం వంటకూడా చెయ్యలేదని. వేగంగా లోపలికెళ్ళి తల్లికి విషయం చెప్పింది.

''ఆ మాత్రం తెలియదా కవితా! ఆయన వద్దంటున్నా వినకుండా తిరుప్పావై విందామని నేనే తీసుకెళ్లాను. నువ్వు వంటచేస్తావని చెబితే ''నీ కూతురికి అంత బాధ్యత కూడానా?!'' అని ఆయన అన్నట్టుగానే నువ్వూ చేశావు. అసలే ఆయన ఆకలికి ఆగలేరని తెలుసుకదా! పెళ్లయి కాపురానికి వెళ్ళాక కూడా చిన్నచిన్న బాధ్యతలు ఎవరొచ్చి నేర్పుతారు'' అంది గాయత్రి అసహనంగా.

మౌనంగా గదిలోకెళ్ళి మంచం మీద పడుకున్న కవితకి తల్లిమాటలు ఎక్కడో గుచ్చుకుంటున్నట్టనిపించాయి.

ఇంట్లో పని చెయ్యమని, వంట చెయ్యమని పురమాయించి బయటికెళ్తున్న తల్లిదండ్రి రోజులో తనతో మాట్లాడే మాటలు రాన్రానూ వేళ్లమీద లెక్కించేవిగా మారాయి.

వారంరోజుల ఒంటరితనం కవిత ఆలోచనల్లో మార్పుకి అంకురాలు వేస్తే, తల్లిదండ్రుల ప్రవర్తన, మౌనం ఆమెని 'తనవాళ్ళ' వైపు చూసేవిలా చేశాయి.

భర్త అనునయం, అత్తగారి ఆప్యాయత, ఆడపడుచు సౌమ్యం కళ్ళముందు కదులుతుంటే వాళ్లతో తనెలా ప్రవర్తించిందో ఒక్కొక్కటీ గుర్తొస్తుంటే...ఆమెలో పేరుకున్న అహం ఆర్ద్రతగా మారి కన్నీళ్ళుగా మారి చెంపలు దిగసాగింది. ఆమె అభిజాత్యం భర్త చాటున ఉన్నంతవరకే. భర్త చాటయితే పుట్టిల్లయినా పరాయిల్లేనని అనుభవైకవేద్యమైన కవిత కోరుతున్న కన్నీళ్ళు తుడుచుకుని, హాల్లో కూచుని పేపర్ చూస్తున్న తండ్రి దగ్గరకెళ్లి ''నాన్నా'' అంది.

''చెప్పమ్మా'' అన్నాడు పేపర్లోంచి తలెత్తకుండానే

''రేపు నేను మా ఇంటికి వెళ్తాను. రేపుదయం ఇంటర్‌సిటీ ట్రైన్ ఎక్కించండి''

''అలానే'' అన్నాడు నారాయణమూర్తి ముక్తసరిగా.

★ ★ ★

మర్నాడుదయం...ట్రైన్‌లో కూర్చున్న కవితతో ''ఈ వారంరోజులూ నీతో కఠినంగా ఉన్నందుకు ఏమీ మనసులో పెట్టుకోకు. ఇన్నాళ్ళూ నువ్వక్కడ గొడవపడి వచ్చినప్పుడల్లా మేం వాళ్లదే తప్పనుకుని ఎంతగా సర్దిచెప్పి పంపినా నువ్వు అర్థం చేసుకోలేకపోయావు.

అనుభవంలోకి వచ్చేసరికి నువ్వు నీ స్థానం ఎక్కడో తెలుసుకున్నావు. నీలో వచ్చిన ఈ మార్పుతో అసలైన ఒంటరితనం అనుభవిస్తున్న మీ ఆడపడుచు భావన భవిష్యత్తుకి కొత్త పునాదులు వెయ్యడంలో మురళికి సహకరించు'' అన్నాడు నారాయణమూర్తి.

''క్షమించండి నాన్నా! ఆయన...'' అంది కళ్లనీళ్ళు తుడుచుకుంటూ.

''మురళికి ఫోన్ చేసి నువ్వొస్తున్నట్టు చెప్పాను. స్టేషన్‌కొచ్చి నిన్ను రిసీవ్ చేసుకుంటానన్నాడు.

ధైర్యంగా వెళ్ళు. ఈసారి ఇలా ఒంటరిగా కాదు, ఇద్దరూ కలిసి రావాలి'' అన్నాడు నారాయణమూర్తి.

గ్రీన్‌సిగ్నల్ పడడంతో ట్రైన్ మెల్లగా ముందుకు కదిలింది.

*

